సాక్షి యాదాద్రి భువనగిరి

బుధవారం ı 29 ı నవంబర్ ı 2023



ఆలోచించి ఓటు వేయాలి

ప్రజాస్వామ్యం, ధనస్వామ్యం మధ్య జరుగుతున్న ఎన్నికలని, ఆలోచించి ఓటు వేయాలని బృందాకారత్ కోరారు. - 2లో



అవినీతి ప్రభుత్వాన్ని తరిమేయాలి

అవినీతి పాలన కొనసాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తరిమేయాలని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం పిలుపునిచ్చారు. - 2లో



కాంగ్రెస్ మాయమాటలు నమ్మొద్దు

కాంగ్రెస్ నాయకుల మాయమాటలు నమ్మి ప్రజలు మోసపోవద్దని డీసీసీబీ చైర్మన్ మహేందర్‌రెడ్డి పేర్కొన్నారు. - 3లో

న్యూస్‌రీల్

డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు సిద్ధం

భువనగిరిటౌన్ : పోలింగ్‌కు సర్వం సిద్ధమైంది. పోలింగ్ సామగ్రి పంపిణీ కోసం భువనగిరిలోని అరోరా ఇంజనీరింగ్ కళాశాలలో, ఆలేరు పట్టణంలోని ఇండోర్ స్టేడియంలో డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలు సిద్ధం చేశారు. ఆయా కేంద్రాల్లో రూట్‌ల వారీగా గ్యాలరీలు ఏర్పాటు చేశారు. పోలింగ్ విధుల్లో పాల్గొనే సిబ్బంది బుధవారం ఉదయం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో రిపోర్ట్ చేయవలసి ఉంటుంది. పోలింగ్ సామగ్రిని చెక్‌లిస్టు ప్రకారం తీసుకొని తమకు కేటాయించిన గ్రామాలకు తరలివెళ్లనున్నారు. రిటర్నింగ్ అధికారుల సమక్షంలో పోలింగ్ సిబ్బందికి సామగ్రి పంపిణీ చేయనున్నారు.

మద్యం దుకాణాలు మూసివేత

భువనగిరి క్రైం : ఈనెల 30వ తేదీన పోలింగ్ నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు మంగళవారం సాయంత్రం 5గంటల నుంచి జిల్లాలో మద్యం దుకాణాలు మూసివేశారు. తిరిగి 30వ తేదీన తెరవనున్నట్లు జిల్లా ఎక్సైజ్ అధికారి నవీన్‌కుమార్ తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 82 వైన్స్‌లు, 12 బార్లు, రెస్టారెంట్లకు సీల్ వేసినట్లు పేర్కొన్నారు.

యాదాద్రిలో సంప్రదాయ పూజలు



కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట : యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి క్షేత్రంలో మంగళవారం సంప్రదాయ పూజలు కొనసాగాయి. హనుమంతుడికి ఇష్టమైన రోజు కావడంతో ప్రధానాలయం, విష్ణు పుష్కరిణి వద్ద ఆంజనేయస్వామిని సింధూరం, పాలతో అభిషేకించి తమలపాకులతో ఆకు పూజ చేశారు. నైవేద్యం సమర్పించి భక్తులకు ప్రసాదంగా అందజేశారు. ఇక ప్రధానాలయంలో శ్రీసుదర్శన నారసింహహోమం, గజవాహనసేవ, నిత్యకల్యాణం, బ్రహ్మోత్సవం, జోడు సేవలు నిర్వహించారు. కార్తీకమాసం సందర్భంగా భక్తులు దీపాలు వెలిగించారు. సత్యనారాయణస్వామి వ్రతాలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

'గొంగిడి' సారథ్యంలోనే ఆలేరు అభివృద్ధి



సమావేశంలో మాట్లాడుతున్న తుంగబాలు

రాజాపేట : ఆలేరు నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందాలంటే గొంగిడి సునీత సారథ్యంలోనే సాధ్యమని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు తుంగ బాలు అన్నారు. మంగళవారం రాజాపేట మండలంలోని రఘునాథపురంలో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్యనాయకుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గోదావరి జలాల రాకతో ఆలేరు సస్యశ్యామలం అయిందని, తాగునీటి సమస్య కూడా తీర్చారని పేర్కొన్నారు. అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. సీఎం కేసీఆర్ యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి క్షేత్రాన్ని అద్భుతంగా తీర్చిదిద్దారని తెలిపారు. అభివృద్ధి కొనసాగాలంటే బీఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు పల్లె సంతోష్ గౌడ్, కొండం రాజు, పల్లె ప్రవీణ్‌గౌడ్, కటుకం స్వామి, రామిండ్ల నరేందర్, గుర్రం సిద్దిరాములు, కటుకం వెంకటేశం, పులి నవీన్, తుంగ అక్షయ్, దొంకెన మహేందర్, కనక రాజు, కరుణాకర్, నరేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక



మనీష, అర్చన

ఆలేరురూరల్ : మండలంలోని గొలనుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న కళ్ల మనీష, మారుపల్లి అర్చన రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు ఎంపికయ్యారు. నిజామాబాద్ జిల్లాలో డిసెంబర్ 3నుంచి 6వ తేదీ వరకు జరగనున్న పోటీల్లో వీరిద్దరూ పాల్గొంటారని పీఈటీ పూల నాగయ్య ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులను ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు అభినందించారు.



భువనగిరిలో ప్రచారం నిర్వహిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి అనిల్‌కుమార్‌రెడ్డి



ఆలేరులో బీఆర్ఎస్ నిర్వహించిన రోడ్ షోలో పాల్గొన్న పార్టీ కార్యకర్తలు

సప్పుడు బంద్!

ముగిసిన ఎన్నికల ప్రచారం

- చివరి రోజు ర్యాలీలు, రోడ్ షోలు
- అగ్రనాయకుల ప్రచారంతో జోష్
- పోల్ మేనేజ్‌మెంట్‌పై పార్టీల దృష్టి
- గెలుపుకోసం అభ్యర్థుల ఆఖరి పాట్లు
- డబ్బు, మద్యం పంపిణీకి సిద్ధం!



వాహనానికి ఏర్పాటు చేసిన ప్రచార సామగ్రిని తొలగిస్తున్న కార్యకర్త

సాక్షి, యాదాద్రి : అసెంబ్లీ ఎన్నికల్లో కీలక ప్రచార ఘట్టానికి తెరపడింది. ఇన్ని రోజులు హోరెత్తించిన మైకులన్నీ మంగళవారం సాయంత్రం 5గంటలకు ఒక్కసారిగా మూగబోయాయి. ప్రచార రథాలన్నీ నిలిచిపోయాయి. ఈసారి మూడు ప్రధాన పక్షాల మధ్య పోరు అనివార్యం కావడంతో రాష్ట్ర, జాతీయ స్థాయి నేతలను సైతం ఆయా పార్టీలు రంగంలోకి దింపాయి. సభలు, ర్యాలీలు రోడ్ షోలతో ఓటర్లను ఆకట్టుకునే యత్నం చేశాయి.

రాష్ట్ర, జాతీయ స్థాయి నేతల రాక

బీఆర్ఎస్ అభ్యర్థుల తరఫున ఆ పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభల్లో పాల్గొనగా.. వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రి హరీష్‌రావు రోడ్ షోలు, కార్నర్ మీటింగ్‌లతో హోరెత్తించారు. కాంగ్రెస్ నుంచి ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి ప్రియాంకగాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, భువనగిరి ఎంపీ, స్టార్ క్యాంపెయినర్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, రాజగోపాల్‌రెడ్డి, విజయశాంతి, తీన్మార్ మల్లన్న ప్రచారం చేశారు. ఇక బీజేపీ అభ్యర్థుల కోసం కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్‌షా, కేంద్ర మంత్రి అనురాగ్ ఠాకూర్, ఈటల రాజేందర్, మందకృష్ణ మాదిగ, సీపీఎం అభ్యర్థుల తరఫున ఆ పార్టీ జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి, కేంద్ర కమిటీ సభ్యుడు చెరుపల్లి సీతారాములు పాల్గొన్నారు. వీరితో పాటు పలువురు మంత్రులు, మాజీ ఎంపీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు ప్రచారంలో పాలుపంచుకున్నారు.

ప్రలోభాల పర్వం!

ప్రచారం ముగియడంతో రాజకీయ పార్టీలు సైలెంట్ ప్రచారంపై దృష్టి సారించాయి. ఎలాగైనా ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి అధికార బీఆర్ఎస్, ప్రతిపక్ష పార్టీలు శాయశక్తులా కృషి చేస్తున్నాయి. ఇప్పటికే గ్రామాల్లోకి డబ్బు తరలించినట్లు వార్తలు వస్తున్నాయి. స్థానిక పరిస్థితులు, గెలుపు అవకాశాల ఆధారంగా ఓటర్లకు డబ్బు పంపిణీ చేయడానికి సిద్ధమైనట్లు తెలుస్తోంది. కులాలు, సంఘాలు, కాలనీలు, అపార్ట్‌మెంట్‌లు, వార్డులు, బూత్‌ల వారీగా విందులు, మద్యం పంపిణీ చేసేందుకు ప్రణాళిక సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. భువనగిరి, ఆలేరు నియోజకవర్గాల్లో పలువురు అభ్యర్థులు ఇప్పటికే 90 శాతం మంది ఓటర్లకు డబ్బులు పంపిణీ చేసినట్లు తెలుస్తోంది. భువనగిరి నియోజకవర్గంలో సగటున ఒక్కో ఓటరుకు రూ.2 వేల నుంచి రూ. 3వేలు, ఆలేరు నియోజకవర్గంలో రూ.1,000 నుంచి రూ.2 వేల వరకు పంపిణీ చేశారన్న ప్రచారం జరుగుతోంది.

ప్రత్యేక టీంల నిఘా

ఎన్నికల ప్రచారం ముగియడంతో డబ్బు, మద్యం పంపిణీపై ఎన్నికల నిఘా బృందాలు ప్రత్యేక నిఘా పెట్టాయి. రాజకీయ పార్టీలు ఓటర్లను ప్రలోభాలకు గురిచేయకుండా పటిష్ట చర్యలు తీసుకుంటున్నారు. అంతేకాకుండా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా జిల్లాలో 144 సెక్షన్ విధించారు. ఈనెల 30న పోలింగ్ ముగిసే వరకు 144 సెక్షన్ అమల్లో ఉండనుంది.

వెళ్లిపోయిన స్థానికేతరులు

అభ్యర్థుల తరఫున ప్రచారానికి చేయడానికి వారి బంధువులు, స్నేహితులతో పాటు ఆయ పార్టీల నాయకులు ఇతర ప్రాంతాల నుంచి వచ్చి కొన్ని రోజులుగా ఇక్కడే మకాం వేశారు. అయితే మంగళవారం సాయంత్రం ప్రచారం ముగిసిన అనంతరం ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం వారంతా నియోజకవర్గాలను విడిచివెళ్లారు.

ప్రతి వంద ఓట్లకు ఓ ఇన్‌చార్జి

పోలింగ్ రోజున చేపట్టాల్సిన ఏర్పాట్లపై రాజకీయ పార్టీలు ప్రత్యేక దృష్టి సారించాయి. ముఖ్యంగా పోల్ మేనేజ్‌మెంట్‌పైనే తమ ఆశలు పెట్టుకున్నాయి. ఓటర్లను పోలింగ్ బూత్ వరకు తీసుకువచ్చి ఓటు వేయించుకునే ప్రయత్నాల్లో నిమగ్నం అయ్యాయి. అధికార బీఆర్ఎస్, కాంగ్రెస్‌పార్టీలు ప్రతి వంద మంది ఓటర్లకు ఒకరిని ఇన్‌చార్జిని నియమించి ఓటర్లను పోలింగ్ కేంద్రం వరకు తీసుకెళ్లేలా ప్రణాళికలు అమలు చేస్తున్నాయి. ఇప్పటికే దాదాపు అన్ని నియోజకవర్గాల్లోని పోలింగ్ బూత్ వారీగా ఓటర్ల వివరాలను దగ్గర పెట్టుకొని అందరిని కలిశారు. ఇక ఆ ఓటర్లను గురువారం పోలింగ్ కేంద్రం తీసుకెళ్లేలా చూడటం, వారికి అవసరమైన డబ్బు, మద్యం పంపిణీపై ప్రత్యేక దృష్టి సారించిన ట్లు తెలుస్తోంది.

ఆఖరి రోజు.. ప్రచార జోరు

చివరి రోజు అభ్యర్థులు ప్రచారాన్ని హోరెత్తించారు. బైక్ ర్యాలీలు, రోడ్ షోలు నిర్వహించారు. కార్యకర్తలతో కలిసి నియోజకవర్గ కేంద్రాల్లోని అన్ని వీధులను బైక్‌లపై చుట్టి వచ్చారు. ఇన్నాళ్లు గ్రూపులుగా విడిపోయి గ్రామాలు, పట్టణాల్లో ప్రచారం చేసిన ఆయా పార్టీల శ్రేణులన్నీ.. మంగళవారం రహదారులపైనే కనిపించడంతో నియోజకవర్గ కేంద్రాలు సందడిగా మారాయి.



భువనగిరిలో బీఆర్ఎస్ బైక్ ర్యాలీ



interview

ప్రజలే నా బలం, బలగం

పదేళ్ల పాలనలో అభివృద్ధే ధ్యేయంగా పనిచేశా

'గడిచిన పదేళ్లలో నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేశా. అన్ని వర్గాలకు అందుబాటులో ఉన్నా. ఎవ్వరికీ ఏ చిన్న హాని తలపెట్టలేదు. ప్రజలే నా బలం, బలగం. సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు, నేను చేసిన అభివృద్ధి పనులు చూసి హ్యాట్రిక్ విజయం అందించడానికి సిద్ధంగా ఉన్నారు'.. అని భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి అన్నారు. ఆయన 'సాక్షి'తో ప్రత్యేకంగా మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే.. -సాక్షి యాదాద్రి

- అన్ని వర్గాలకు అందుబాటులో ఉన్నా
- ఏ ఒక్కరికీ చిన్నహాని కూడా తలపెట్టలేదు
- కేసీఆర్ పథకాలే నన్ను గెలిపిస్తాయి

భువనగిరి బీఆర్ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డి

భువనగిరి అభివృద్ధి కోసం, ప్రజల సంక్షేమం కోసం అహర్నిశలు కృషి చేశాను. ప్రజలకు ఎలాంటి సమస్యలు ఉండొద్దన్న ఉద్దేశంతో ప్రభుత్వ నిధులే కాకుండా నా సొంత డబ్బులతోనూ పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేపట్టాను. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఎవరిని ఇబ్బంది పెట్టకుండా సేవ చేస్తున్నా. కేసీఆర్ సంక్షేమ పథకాలు, ప్రజల ఆశీర్వాదంతో మరోసారి గెలిచి నియోజకర్గాన్ని అభివృద్ధిలో మరింత ముందుకు తీసుకెళ్తా. ఎన్ని కోట్లు ఖర్చయినా సరే.. పనులన్నీ పూర్తి చేస్తాం.

అన్ని వర్గాలు హాయిగా ఉన్నాయి

నేను ఎమ్మెల్యేగా గెలిచే నాటికి భువనగిరి నియోజకవర్గంలో శాంతిభద్రతలు ఏ విధంగా ఉన్నాయో ప్రజలందరికీ తెలుసు. అభివృద్ధి జరగాలంటే ప్రశాంతమైన వాతావరణం అవసరం. కేసీఆర్ ఆలోచనలకు అనుగుణంగా భువనగిరిలో శాంతిభద్రతలకు అదుపులో ఉంచాం. వ్యాపారులు, సంపన్నులతోపాటు అన్ని వర్గాల ప్రజలు హాయిగా జీవిస్తున్నారు. ఈ విషయం ఎవరిని అడిగినా చెబుతారు. ఎమ్మెల్యేగా నేను కూడా ఏ ఒక్కరికీ హాని చేయలేదు. అన్ని వర్గాలకు అందుబాటులో ఉన్నా. ఆపదలో ఉండి ఎవరు వచ్చినా సాయం చేశా.

విద్య, వైద్యం, ఉపాధికి పెద్దపీట

మళ్లీ గెలిస్తే విద్య, వైద్యం, ఉపాధికి పెద్దపీట వేస్తా. ప్రభుత్వం కల్పించే పదోన్నతితో అభివృద్ధిని కొత్త పుంతలు తొక్కిస్తా. గ్రామాలకు రవాణా సౌకర్యం మెరుగుపరుస్తా. కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు భువనగిరికి ఐటీ హబ్ వస్తుంది. ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపడుతాయి. యువతకు స్వయం ఉపాధి కల్పిస్తా. మూసీ కాలుష్య నివారణకు చర్యలు చేపడుతా. చేనేత, కులవృత్తులు, వ్యవసాయందాని అనుబంధ రంగాలకు చేయూతనిస్తా. మహిళలకు భద్రత, ఉపాధికి ప్రాధాన్యం ఇస్తాను. కేసీఆర్‌పై నమ్మకంతో మరోసారి ఆశీర్వదించాలి.

సాగు, తాగునీటి గోస తీర్చాను

తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు నియోజకవర్గంలో తాగునీటి సమస్య తీవ్రంగా ఉండేది. ప్రజలు మూసీ కలుషిత జలాలు, ఫ్లోరైడ్ నీటిని తాగేవారు. బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ గోస తీరింది. మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ స్వచ్ఛమైన నీటిని అందజేస్తున్నాం. అలాగే సాగునీటి కాల్వలను అభివృద్ధి చేయడంతో సాగు విస్తీర్ణం పెరిగింది. బస్వాపురం రిజర్వాయర్ పనులు తుది దశకు చేరాయి. ఈసారి కూడా అధికారంలోకి వస్తే పెండింగ్ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందజేస్తా.

చెప్పలేనంతగా అభివృద్ధి

నియోజకవర్గం అభివృద్ధిలో దూసుకుపోతోంది. కేసీఆర్, కేటీఆర్ సహకారంతో పల్లె, పట్టణం తేడా లేకుండా అన్ని చోట్ల బీటీ, సీసీ రోడ్లు, అండర్‌గ్రౌండ్ డ్రెయినేజీలు పెద్ద ఎత్తున నిర్మించాం. భువనగిరి, రాయగిరి చెరువులను సుందరీకరించా. బీబీనగర్‌లో సాంఘిక సంక్షేమ మహిళా డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయించా. భువనగిరిలో రోడ్ల విస్తరణ, విద్యుదీకరణ, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ నిర్మాణంతో రైతుబజార్‌ను ఆధునీకరించా. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో క్రీడాకారులకు, వాకర్స్‌కు అనువైన గ్రౌండ్ సిద్ధం చేయించా. బీఎన్ తిమ్మాపూర్ నిర్వాసితులకు ఆర్‌అండ్ ప్యాకేజీ కింద ఇళ్లస్థలాలు పంపిణీ చేశాం. మూసీపై వంతెనలు పూర్తి చేయవలిసి ఉంది. రీజినల్ రింగ్ రోడ్డు మార్పునకు కృషి చేస్తా.అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నాం. దళితబంధు, బీసీబంధు కొందరికి అందుతుంది. ఎన్నికల షెడ్యూల్ రావడంతో మిగతావారికి పెండింగ్ పడింది. విడతల వారీగా అర్హులందరికీ ఇస్తాం.

పోలింగ్‌కు ఏర్పాట్లు చేశాం

- స్వేచ్ఛాయుత వాతావరణంలో ప్రజలు ఓటు వేయాలి
- కలెక్టర్ హనుమంతు కె.జెండగే



విలేకరులతో మాట్లాడుతున్న కలెక్టర్, చిత్రంలో డీసీపీ రాజేశ్‌చంద్ర, అదనపు కలెక్టర్

సాక్షి, యాదాద్రి : పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ హనుమంతు కె.జెండగే కోరారు. మంగళవారం ఆయన కలెక్టరేట్‌లో డీసీపీ రాజేశ్ చంద్రతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 30న ఉదయం 7నుంచి సాయంత్రం 5గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. ఎన్నికల కమిషన్ సూచించిన 13 రకాల గుర్తింపు కార్డుల్లో ఏదేని ఒకటి తీసుకెళ్లాలని ఓటర్లకు సూచించారు. పోలింగ్ సిబ్బంది బుధవారం ఉదయం డిస్ట్రిబ్యూషన్ కేంద్రాల్లో రిపోర్ట్ చేయాలన్నారు. భువనగిరి నియోజకవర్గానికి స్థానిక అరోరా ఇంజనీరింగ్ కాలేజీలో, ఆలేరుకు సంబంధించి ఆలేరులోని ఇండోర్ స్టేడియంలో డిస్ట్రిబ్యూషన్, రిసిప్షన్ కేంద్రాలు ఏర్పాటు చేశామని చెప్పారు. మంగళవారం సాయంత్రం 5 గంటల నుంచి 30వ తేదీ పోలింగ్ పూర్తయ్యే వరకు సైలెన్స్ పీరియడ్‌గా పరిగణించాలని ప్రజలక సూచించారు.జిల్లా వ్యాప్తంగా 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు.వార్తా పత్రికల్లో ప్రకటనలకు ముందస్తు అనుమతి పొందాలన్నారు.ఎగ్జిట్‌పోల్స్‌పై నిషేధం ఉందని వివరించారు. డిసెంబరు 3న భువనగిరిలోని అరోరా ఇంజనీరింగ్ కాలేజీలో ఓట్ల లెక్కింపు నిర్వహించనున్నట్లు కలెక్టర్ తెలిపారు.

పోలింగ్ కేంద్రాల వద్ద ఐదంచెల భద్రత : డీసీపీ రాజేశ్‌చంద్ర

పోలింగ్ సజావుగా జరిగేలా పోలింగ్ కేంద్రాల వద్ద ఐదంచెల భద్రత ఏర్పాటు చేస్తున్నట్లు డీసీపీ రాజేశ్ చంద్ర తెలిపారు. ప్రతి పోలింగ్ బూత్‌లో వీడియో గ్రఫీ ఉంటుందన్నారు. పోలింగ్ పూర్తయ్యే వరకు లిక్కర్ అమ్మకాలపై నిషేధం ఉందన్నారు. రాజకీయ పార్టీలు ప్రచార కార్యక్రమాలు చేపట్టరాదని, ఎవరైనా నిబంధనలు ఉల్లంఘిస్తే సీ–విజిల్ యాప్, 1950 ద్వారా ఫిర్యాదు చేయవచ్చనానరు. బందోబస్తులో పాల్గొనే అన్ని టీంలు యాక్టివ్‌గా ఉన్నట్లు చెప్పారు. రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్ భాస్కర్‌రావు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన



మోటకొండూరులోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల పరిశీలకుడు

మోటకొండూర్ : మండల కేంద్రంతో పాటు చాడ, దిలావర్‌పూర్ గ్రామాల్లో పోలింగ్ కేంద్రాలను మంగళవారం కేంద్ర ఎన్నికల పరిశీలకుడు విపుల్‌కుమార్ సందర్శించారు. కేంద్రాల్లో కల్పించిన సౌకర్యాలను పరిశీలించారు. అధికారులు, బీఎల్ఓలకు సూచనలు చేశారు. ఓటర్లు స్వేచ్ఛాయుత వాతావరణంలో ఓటు హక్కు వినియోగించుకునే విధంగా ఏర్పాట్లు ఉండాలన్నారు. ఆయన వెంట తహసీల్దార్ శాంతిలాల్, ఎస్సై తేజంరెడ్డి ఉన్నారు.

బీజేపీ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి

- భువనగిరి బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి



ఎదుళ్లగూడెంలో వృద్ధురాలిని ఓటు అభ్యర్థిస్తున్న గూడూరు నారాయణరెడ్డి

వలిగొండ : బీజేపీ అధికారంలోకి వస్తేనే రాష్ట్రం, నియోజకవర్గం సమగ్రాభివృద్ధి సాధిస్తుందని భువనగిరి బీజేపీ అభ్యర్థి గూడూరు నారాయణరెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వలిగొండ మండలంలోని ప్రొద్దటూరు, ఏదుళ్లగూడెం గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఓటు వేయాలని అభ్యర్థించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని నెరవేర్చలేదన్నారు. తనను ఎమ్మెల్యేగా గెలిపిస్తే ఈ ప్రాంతం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. వలిగొండ మండలాన్ని ఎచ్ ఎండీఏ పరిధిలోకి తీసుకువస్తానని, భువనగిరితో పాటు వలిగొండలోనూ సొంత నిధులతో డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. సంగెం వద్ద మూసీపై బ్రిడ్జి నిర్మించి ప్రజల కష్టాలు తీరుస్తానన్నారు. అలాగే నియోజకవర్గ ప్రజలకు శాపంగా మారిన మూసీ జల కాలుష్యం నుంచి విముక్తి కల్పిస్తానని, ఐటీ కారిడార్ తీసుకువచ్చి నిరుద్యోగ యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తానని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు సీఎస్ రెడ్డి, పసుమటి జగన్ మోహన్‌రెడ్డి, చందా మహేందర్, చిట్టెడి అభితేజ్ రెడ్డి, నాగెల్లి సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఆలేరును సస్యశ్యామలం చేశా

- ఆలేరు బీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత



ఆలేరులో ప్రచారం నిర్వహిస్తున్న గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి

ఆలేరురూరల్ : పదేళ్లలో చెప్పలేనంత అభివృద్ధి చేశానని, మరోసారి అవకాశం ఇస్తే ఆలేరు నియోజకవర్గాన్ని రాష్ట్రంలోనే ఆదర్శంగా తీర్చిదిద్దుతానని ప్రభుత్వ విప్, ఆలేరు బీఆర్ఎస్ అభ్యర్థి గొంగిడి సునీత హామీ ఇచ్చారు. మంగళవారం ఆలేరులో ర్యాలీ నిర్వహించారు. అనంతరం కార్నర్ మీటింగ్‌లో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలనలో నియోజకవర్గంలోని గ్రామాల రూపురేఖలే మారిపోయాయన్నారు. ప్రతి పల్లెలో సీసీ రోడ్లు, డ్రెయినేజీలు ఇతర అభివృద్ధి పనులు చేపట్టానని తెలిపారు. గోదావరి జలాల తీసుకువచ్చి, చెక్‌డ్యాంలు నిర్మించి బీడు భూములను సస్యశ్యామలం చేశామని చెప్పారు. వ్యవసాయానికి 24 గంటలు ఉచిత విద్యుత్ ఇస్తుంటే.. కాంగ్రెస్ నాయకులు మూడు గంటలు సరిపోతుందనడం రైతులపై వారికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తుందన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనే రాష్ట్రానికి శ్రీరామరక్ష అన్నారు. సంక్షేమ పథకాలు నిర్విరామంగా కొనసాగాలన్నా, మరింత అభివృద్ధి జరగాలన్నా రాష్ట్రంలో, నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ ఆలేరు పట్టణ అధ్యక్షుడు పుట్ట మల్లేశం, మున్సిపల్ వైస్ చైర్మన్ మొరిగాడి మాధవివెంకటేష్, మాజీ సర్పంచ్ దాసి సంతోష్, బేతిరాములు, మురళీ, బొట్ల పరమేష్, శ్రీకాంత్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

హోటళ్లలో తనిఖీలు



బేకరీలో శాంపిల్స్ సేకరిస్తున్న అధికారులు

భువనగిరి క్రైం : పట్టణంలోని పలు హోటళ్లు, బేకరీలలో మంగళవారం ఫుడ్ సేఫ్టీ అధికారులు తనిఖీలు నిర్వహించారు. కిచెన్‌లతో పాటు ఆహారపదార్థాల ప్యాకెట్‌లపై తయారీ, గడువు తేదీలను పరిశీలించారు. శాంపిల్స్ సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపించారు. శాంపిల్స్ కల్తీ అని తేలితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఫుడ్ సేఫ్టీ అధికారులు సుమాన్ కల్యాణ, స్వాతి హెచ్చరించారు. వినియోగదారులకు నాణ్యమైన ఆహారపదార్థాలు అందజేయాలని, పరిశుభ్రత పాటించాలని నిర్వాహకులకు సూచించారు.



భువనగిరి పట్టణంలోని అరోరా కళాశాలలో పోలింగ్ సామగ్రి పంపిణీకి ఏర్పాట్లు చేసిన అధికారులు


నల్లగొండలో బీఆర్ఎస్ అభ్యర్థి ప్రచార వాహనానికి ఫ్లెక్సీలు తీసేస్తున్న దృశ్యం


నల్లగొండ పట్టణంలోని బోయవాడ పోలింగ్ స్టేషన్ ఎదుట ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ


నార్కట్‌పల్లి జెడ్పీహెచ్ఎస్‌లో ఏర్పాటు చేసిన మహిళా పోలింగ్ స్టేషన్


నల్లగొండలో పోలింగ్ సిబ్బందికి సూచనలు చేస్తున్న ఆర్డీఓ రవి

● ఉత్సాహం ఉరకలు..


భువనగిరి: పట్టణంలో బీఆర్ఎస్ అభ్యర్థి పైళ్ల శేఖర్‌రెడ్డికి మద్దతుగా కార్ల ర్యాలీ తీస్తున్న బీఆర్ఎస్ నాయకులు


చివ్వెంల: ఎన్నికల ప్రచారంలో భాగంగా మంత్రి జగదీశ్‌రెడ్డికి మద్దతుగా బి.చందుపట్ల గ్రామంలో బైక్ ర్యాలీ నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు


తిరుమలగిరి(తుంగతుర్తి): ప్రచారంలో గులాబీ కండువా ఊపుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి కిషోర్


అర్వపల్లి: మహిళా కార్యకర్తలతో కలిసి డ్యాన్స్ చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ గుజ్జ దీపిక, గాదరి కిషోర్ సతీమణి కమల


మిర్యాలగూడ: ర్యాలీలో కండువా ఊపుతున్న బీఆర్ఎస్ అభ్యర్థి భాస్కర్‌రావు


సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తాళ్లగడ్డ ప్రాంతంలో మంత్రి జగదీశ్‌రెడ్డికి మద్దతు తెలుపుతున్న గౌడ సంఘం సభ్యులు

జంగ్ తెలంగాణ

అవినీతి ప్రభుత్వాన్ని తరిమేయాలి


దేవరకొండలో ప్రజా ఆశీర్వాద సభకు హాజరైన ప్రజలు


మాట్లాడుతున్న దేవేంద్ర ఫడ్నవీస్, చిత్రంలో బీజేపీ అభ్యర్థి లాలునాయక్

- బీఆర్ఎస్, కాంగ్రెస్‌లతో ఒరిగిందేమీ లేదు
- బీజేపీ అభ్యర్థి లాలునాయక్‌ను గెలిపించాలి
- దేవరకొండ ప్రజా ఆశీర్వాద సభలో మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్

దేవరకొండ: రాష్ట్రంలో అవినీతి పాలన కొనసాగిస్తున్న బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని తరిమేయాలని, బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలతో దేశానికి, రాష్ట్రానికి ఒరిగిందేమీ లేదని మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ అన్నారు. మంగళవారం దేవరకొండలో నిర్వహించిన ప్రజా ఆశీర్వాద సభకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. దేవరకొండ బీజేపీ అభ్యర్థి లాలునాయక్‌కు మద్దతుగా ఇక్కడికి వచ్చిన అశేష జనవాహినిని చూస్తుంటే లాలునాయక్ ఇప్పటికే గెలిచినట్లు కనిపిస్తుందన్నారు. త్వరలోనే తెలంగాణలో బీజేపీ సర్కార్ ఏర్పాటు కానుందని ధీమా వ్యక్తం చేశారు. కేంద్రంలో, రాష్ట్రంలో బీజేపీతోనే సుస్థిర పాలన సాధ్యమవుతుందని పేర్కొన్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ఏ ఒక్క హామీని బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయలేదని ఆరోపించారు. బీజేపీ అధికారంలోకి రాగానే ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లను పెంచడంతో పాటు పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించి ఏడాదికి ఉచితంగా నాలుగు సిలిండర్లు ఇస్తామని ప్రకటించారు. ఎమ్మెల్యే కాక ముందు ఐదెకరాలున్న ఇక్కడి ఎమ్మెల్యేకు ఇప్పుడు 500 ఎకరాలు ఎక్కడి నుంచి వచ్చాయని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఏ రోజు ఏ పార్టీలో ఉంటాడో ఆయనకే తెలియదని ఎద్దేవా చేశారు. దేశంలో ఎక్కడాలేని విధంగా తెలంగాణలో అవినీతి రాజ్యమేలుతుందన్నారు. రాష్ట్రంలో నిరుద్యోగులకు ఉద్యోగం రాకపోయినప్పటికీ.. కేసీఆర్ కుటుంబంలో ప్రతి ఒక్కరికీ రాజకీయ ఉపాధి దొరికిందన్నారు. 2015లో తాను మహారాష్ట్ర ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు తెలంగాణ రైతాంగానికి సాగునీరు కావాలని కేసీఆర్ తనను అడిగారని, దీంతో మహారాష్ట్ర నుంచి కాళేశ్వరానికి నీరిచ్చి తెలంగాణ రైతాంగానికి సహాయ సహకారాలు అందించానని గుర్తు చేశారు. కానీ, కాళేశ్వరం పేరుతో రూ.లక్షల కోట్ల అవినీతి జరుగుతుందని తనకు అప్పుడు తెలియదన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలంగాణకు పూర్తిగా వ్యతిరేకమని, తెలంగాణ రాష్ట్రాన్ని మేమే ఇచ్చామంటూ కాంగ్రెస్ నేతలు అంటున్నారు.. కానీ ఎంతో మంది బలిదానాలతో రాష్ట్రం ఏర్పడిందని అన్నారు. బీజేపీ సైతం ప్రత్యేక తెలంగాణ కోసం పాటుపడిందని గుర్తుచేశారు. తెలంగాణ రాష్ట్రానికి బీసీ ముఖ్యమంత్రి కావాలంటే బీజేపీతోనే సాధ్యపడుతుందన్నారు. కేతావత్ లాలునాయక్‌ను దేవరకొండ ఎమ్మెల్యేగా గెలిపించాలని కోరారు.

చిత్తశుద్ధితో పనిచేస్తా: కేతావత్ లాలునాయక్

తనను ప్రజలు ఆశీర్వదించి గెలిపిస్తే చిత్తశుద్ధితో పనిచేస్తానని ఎమ్మెల్యే అభ్యర్థి కేతావత్ లాలునాయక్ అన్నారు. తనకు ఒక్కసారి అవకాశం ఇస్తే ఇక్కడి యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాల కోసం ఇండస్ట్రియల్ పార్కుతో పాటు దేవరకొండను జిల్లాగా ఏర్పాటు చేయించేందుకు కృషి చేస్తానన్నారు. ఈ సభలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ ఏటి.కృష్ణ, నాయకులు ప్రేమేందర్‌రెడ్డి, చీకోటి ప్రవీణ్, ప్రదీప్‌కుమార్, కర్నాటి సురేష్, గార్లపాటి జితేందర్, చెనమోని రాములు, అంకూరి నర్సింహ, దావ శ్రీను, నక్క వెంకటేశ్ యాదవ్, వనం జగదీశ్వర్, వినోద్ రాథోడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజలు ఆలోచించి ఓటు వేయాలి


ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్యకర్తలు, కళాకారులు


ప్రజలకు అభివాదం చేస్తున్న బృందాకారత్, చిత్రంలో సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మి

- సీపీఎం పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందాకారత్

హుజూర్‌నగర్: ప్రజాస్వామ్యం, ధనస్వామ్యం మధ్య ఎన్నికలు జరుగుతున్నాయని, ప్రతి ఓటరు ఆలోచించి ఓటు వేసి సీపీఎంను గెలిపించాలని ఆ పార్టీ పొలిట్ బ్యూరో సభ్యురాలు బృందా కారత్ అన్నారు. హుజూర్‌నగర్ సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మిని గెలిపించాలని కోరుతూ మంగళవారం పట్టణంలో రోడ్డుషో, ర్యాలీ నిర్వహించారు. అనంతరం పొట్టి శ్రీరాములు సెంటర్‌లో ఏర్పాటు చేసిన కార్నర్ మీటింగ్‌లో ఆమె మాట్లాడారు. ఇంతకుముందు కాంగ్రెస్, బీఆర్ఎస్ వారు గెలిచి చేసిందేమీ లేదని ఆరోపించారు. పేదల పక్షాన పోరాటం చేసే సీపీఎం అభ్యర్థి మల్లు లక్ష్మిని ఆశీర్వదించాలని కోరారు. మల్లు లక్ష్మిని గెలిపిస్తే పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు మంజూరు చేయిస్తామని తెలిపారు. మల్లు లక్ష్మి మాట్లాడుతూ దళితులను కేసీఆర్ ప్రభుత్వం మోసగించిందని, ఇచ్చిన ఏ హామీని నిలబెట్టుకోలేదని విమర్శించారు. తనను గెలిపిస్తే మండలాల్లో రైతుల కోసం శీతల గిడ్డంగులు ఏర్పాటు చేయిస్తానన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లు నాగార్జునరెడ్డి, నాయకులు పారేపల్లి శేఖర్‌రావు, కోట రమేష్, నెమ్మాది వెంకటేశ్వర్లు, పల్లె వెంకటరెడ్డి, నాగారపు పాండు, కౌన్సిలర్ త్రివేణి, ఏకలక్ష్మి, శ్రీకాంత్‌వర్మ, వెంకటరెడ్డి, యాదగిరిరావు, వీరస్వామి, మురళి బ్రహ్మం, యోనా, వీరమల్లు తదితరులు పాల్గొన్నారు. కాగా.. సీపీఎం ఆధ్వర్యంలో చేపట్టిన రోడ్‌షోలో అరుణ పతాకాలతో హుజూర్‌నగర్ పట్టణం ఎరుపెక్కింది. డప్పు చప్పుళ్లు, కోలాట నృత్యాలు, ఆట పాటలతో కళాకారులు సందడి చేశారు. రోడ్ షో, కార్నర్ మీటింగ్‌తో నాయకులు, కార్యకర్తల్లో కొత్త ఉత్సాహం నింపింది.

కాంగ్రెస్ మోసం చేసింది.. బీఆర్ఎస్ అణచివేసింది

- ఎస్సీ వర్గీకరణకు మద్దతిస్తామన్న బీజేపీని గెలిపించండి
- చండూరు సభలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ


సభలో మాట్లాడుతున్న మంద కృష్ణమాదిగ, చిత్రంలో బీజేపీ అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి

చండూరు: ముప్పై ఏళ్లుగా ఎస్సీ వర్గీకరణ చేయకుండా కాంగ్రెస్ మోసం చేస్తే, బీఆర్ఎస్ ప్రభుత్వం దళితులను అణచివేసిందని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ ఆవేదన వ్యక్తం చేశారు. బీజేపీ మునుగోడు అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ చండూరులో ఏర్పాటు చేసిన మాదిగల సమరభేరి సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ బిల్లుకు సహకరిస్తామని దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ హామీ ఇవ్వడం వల్లే ఈ ఎన్నికల్లో బీజేపీకి మద్దతు ఇస్తున్నట్లు మాదిగలకు వివరించారు. నేను ఏదిచేసినా మాదిగల అభ్యున్నతి కోసమేనని.. నన్ను నమ్మి బీజేపీని గెలిపించాలని పిలుపునిచ్చా రు. నా జాతి అభివృద్ధి కోసమే ఏ పార్టీలో చేరడం లేదని, ఎస్సీ వర్గీకరణ సాధించి నా జాతి బిడ్డలకు న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. తెలంగాణ ఉద్యమం సమయంలో కేసీఆర్ ప్రాణాపాయ స్థితి లో ఉన్నప్పుడు నిమ్మరసం ఇచ్చి ప్రాణం కాపాడితే దానికి ఫలితంగా నన్ను రెండుసార్లు జైల్లో పెట్టించారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితున్నీ ముఖ్యమంత్రి ఎందుకు చేయలేదని, మూడెకరాల భూమి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించినందుకు కేసీఆర్ నన్ను జైల్లో పెట్టారన్నారు.

మాదిగలంతా బీజేపీని ఆదరించండి

మాదిగల చిరకాల వాంఛ అయిన ఎస్సీ వర్గీకరణ చేపడతామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించనందున మాదిగలంతా బీజేపీని ఆదరించి తనకు ఓటియ్యాలని ఆ పార్టీ మునుగోడు అభ్యర్థి చలమల్ల కృష్ణారెడ్డి కోరారు. ఈ సభలో బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగిడి మనోహర్‌రెడ్డి, దూడల భిక్షం, ఎమ్మార్పీ ఎస్ జిల్లా అధ్యక్షుడు ఇరిగి శ్రీశైలం, మండల అధ్యక్షుడు ఇరిగి దుర్గాప్రసాద్, దర్శనం వేణు, చిలుక జయరాం, గోపీనాథ్, చరణ్ పాల్గొన్నారు.

ఆశీర్వదించండి.. అందుబాటులో ఉంటా

- బీజేపీ అభ్యర్థి పడాల శ్రీనివాస్


మాట్లాడుతున్న బీజేపీ అభ్యర్థి పడాల శ్రీనివాస్

ఆలేరురూరల్ : ఆశీర్వదించి గెలిపిస్తే ఆలేరు నియోజకర్గంలో ప్రజలకు అందుబాటులో ఉంటానని ఆలేరు బీజేపీ అభ్యర్థి పడాల శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలో నిర్వహించిన రోడ్ షోలో ఆయన పాల్గొని మాట్లాడారు. బీజేపీ అధికారంలోకి వస్తే అమలు చేసే పథకాల గురించి వివరించారు. 9ఏళ్లలో ఆలేరులో జరిగిన అభివృద్ధి శూన్యం అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం గల్లీలో బెల్టుషాపులు పెట్టి యువకులను వ్యసనపరులుగా మారుస్తోందని, ఉద్యోగాలు కల్పించడంలో విఫలమైందన్నారు. తాము అధికారంలోకి వస్తే పది లక్షల ఉద్యోగాలు కల్పిస్తామన్నారు. ధాన్యం కొనుగోలు విషయంలో పాలకులకు పట్టింపు లేదన్నారు. కుటుంబ, అవినీతి పాలన పోవాలంటే రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రావాలన్నారు. బీసీ ముఖ్యమంత్రి కావాలంటే బీజేపీకి పట్టం కట్టాలన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ కన్వీనర్ చెరిగె శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు బడుగు జహంగీర్, కౌన్సిలర్ సంగు భూపతి, జిల్లా మహిళ కార్యదర్శి సముద్రాల కల్పన, చింతకింది కీర్తన, మహేష్, బాలరాజు, పడగడాల శ్రీనివాస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

డీజే సౌండ్‌కు గుండెపోటుతో మహిళ మృతి

కొండమల్లేపల్లి: దేవరకొండ నియోజకవర్గంలోని కొండమల్లేపల్లిలో ఓ రాజకీయ పార్టీ ప్రచారం నిర్వహిస్తున్న క్రమంలో డీజే సౌండ్ కారణంగా ఓ మహిళ గుండెపోటుకు గురై మృతి చెందింది. కొండమల్లేపల్లి మండల కేంద్రానికి చెందిన గుంటోజు అమృతమ్మ(51) దినసరి కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తుంది. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా మంగళవారం కొండమల్లేపల్లి మండల కేంద్రంలో ఓ పార్టీ అభ్యర్థి రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫోర్ పిన్ డిజే సౌండ్స్‌తో తీవ్రమైన శబ్దాన్ని తట్టుకోలేక అమృతమ్మ గుండెపోటుకు గురై కుప్పకూలింది. దీంతో స్థానికులు ఆమెను దేవరకొండ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అమృతమ్మను పరీక్షించిన వైద్యులు.. అప్పటికే ఆమె మృతి చెందినట్లు తెలిపారు. ఈ ఘటనపై తమకు ఫిర్యాదు ఏమీ అందలేదని పోలీసులు తెలిపారు.

దోపిడీదారుడికి ప్రజలు చరమగీతం పాడాలి

- తుంగతుర్తి కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్


మోత్కూరు : రోడ్ షోలో పాల్గొన్న ప్రజలు

మోత్కూరు : ఇసుక మాఫియా, ల్యాండ్ మాఫియా, దోపిడీదారుడైన తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిషోర్ కుమార్‌కు ప్రజలు చరమగీతం పాడాలని మందుల సామేల్ అన్నారు. మంగళవారం ఎన్నికల ప్రచారంలో భాగంగా మోత్కూరులో ముందుగా శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి రోడ్డు షోలో పాల్గొన్నారు. అనంతరం స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో ప్రకృతి వనరులను దోపిడీ చేస్తున్న కిషోర్‌కుమార్‌ను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఇసుక రవాణాను అడ్డుకున్న రైతులు, మహిళలపై అక్రమ కేసులు బనాయించారని అన్నారు. తనను గుర్తించి ఎమ్మెల్యేగా టికెట్ ఇచ్చిన కాంగ్రెస్‌ను ప్రాణం ఉన్నంత వరకు వీడేది లేదన్నారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యదర్శి గోద శ్రీరాములు, జిల్లా సహాయ కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యుడు చెడె చంద్రయ్య, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల యాదగిరిరెడ్డి, అడ్వొకేట్ పన్రెపాటి యుగేంధర్, కాంగ్రెస్ మండల, పట్టణ అధ్యక్షులు వంగాల సత్యనారాయణ, గుండగోని రామచంద్రు, జిల్లా నాయకులు పైళ్ల సోమిరెడ్డి, అవిశెట్టి అవిలుమల్లు, యూత్ కాంగ్రెస్ జిల్లా కార్యదర్శులు కారుపోతుల వెంకన్న, మందుల సురేష్, బొల్లు యాదగిరి, పన్నాల శ్రీనివాస్‌రెడ్డి, నాగార్జున్‌రెడ్డి, ప్రవీణ్‌కుమార్, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరికలు

మండలంలోని దత్తప్పగూడెం గ్రామ మాజీ సర్పంచ్ ముక్కెర్ల నర్సయ్య, బీఆర్ఎస్ నాయకులు బరిగెల కోటేష్, కంచర్ల రఘుపతిరెడ్డి, గనగాని రమేష్‌లు మంగళవారం కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి కంచర్ల యాదగిరిరెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో ఎంపీటీసీ ఆకవరం లక్ష్మణాచారి తదితరులు పాల్గొన్నారు.

అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తా



అడ్డగూడూరు : మాట్లాడుతున్న సామేల్

అడ్డగూడూరు : ఎమ్మెల్యేగా ఒక్కసారి అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని కాంగ్రెస్ అభ్యర్థి మందుల సామేల్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంతో పాటు చిర్రగూడూరు, కోటమర్తి గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఆరు గ్యారంటీలను అమలు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పోలేబోయిన లింగయ్యయాదవ్, మాజీ మార్కెట్ చైర్మన్ వల్లంభట్ల పూర్ణచంద్రరావు, మాజీ సింగిల్ విండో చైర్మన్ చిత్తలూరి హనుమంతరావు, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు చేడే చంద్రయ్య, ఎంపీటీసీ పెండెల భారతమ్మ, చిత్తలూరి సోమయ్య, చిత్తలూరి సోమనారాయణ, పట్టణ శాఖ అధ్యక్షుడు సోమిరెడ్డి, పాండు, నాగరాజు, రమేష్, సైదులు తదతరులు పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాల పరిశీలన


ఆత్మకూరు (ఎం): పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎన్నికల ప్రత్యేక పరిశీలకుడు

ఆత్మకూరు(ఎం): మండలంలోని సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలుగా గుర్తించబడిన ఆత్మకూరు (ఎం), కొరటికల్ పోలింగ్ కేంద్రాలను మంగళవారం ఎన్నికల పరిశీలకుడు విపుల్ కమార్ మంగళవారం పరిశీలించారు. అనంతరం కప్రాయపల్లి చెక్‌పోస్టును తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్సీ కార్పొరేషన్ అభివృద్ధి అధికారి శ్యామ్ కుమార్, ఎస్‌ఐ దొమ్మేటి నాగరాజు, ఎంపీడీఓ నిరంజన్, ఆర్ఐ చిప్పలపెల్లి యాదగిరి పాల్గొన్నారు.

గుండాల : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ బూత్‌లను ఎన్నికల అబ్జర్వర్ ఐపీఎస్ విపుల్‌కుమార్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్‌లలో ఏర్పాటు చేసిన కనీస వసతులను పరిశీలించి ఎన్నికలు ప్రశాంతంగా జరిగేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఆయన వెంట ఎంపీడీఓ జి.శ్రీనివాసులు, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్యాంసుందర్, సెక్టోరియల్ అధికారి లావణ్య, ఎస్‌ఐ యాకన్న, వీఎల్‌వోలు కోమటి శ్రీను, యాదయ్య, పంచాయతీ కార్యదర్శులు రమేష్, మౌనిక తదితరులు పాల్గొన్నారు.

సంస్థాన్ నారాయణపురం: అసెంబ్లీ న్నికల నేపథ్యంలో మండలంలోని పొర్లగడ్డ, బోటిమీదితండా, వాచ్యాతండాలోని పోలింగ్ కేంద్రాలను మంగళవారం జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి పరిశీలించారు. ఆయన వెంట ఎంపీడీఓ రాములు, ఎంపీఓ నర్సింహరావు తదితరులు పాల్గొన్నారు.